పెన్నాలో జలకళ... పాపఘ్ని వెలవెల

ఒకే ప్రాంతంలో విభిన్న పరిస్థితులు


సిద్దవటం శివారులో పెన్నానదిలో ప్రవహిస్తున్న నీరు

ఓ వైపు పెన్నానది జల సవ్వడితో సందడి చేస్తుంటే, మరోవైపు పాపఘ్ని నదిలో చుక్కనీరు లేక ఎడారిని తలపిస్తోంది. ఒకే జిల్లాలో విభిన్న పరిస్థితులకు ఇది దర్పణంగా నిలుస్తోంది. ఎగువన కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో ఆ నీరంతా కుందూ నదిలోకి చేరుతోంది. అక్కడ నుంచి కేసీ కాలువ ఆయకట్టుకు సేద్యపు జలాలు విడుదల చేశారు. మైలవరం జలాశయం గేట్లు ఎత్తి కిందకు వదిలారు. ఈ నీరంతా పెన్నా నదిలో చేరి జలకళ సంతరించుకుంది. మరోవైపు అన్నమయ్య జిల్లా నుంచి వైఎస్‌ఆర్‌లో ప్రవేశించే పాపఘ్ని నదిలో వర్షాభావ పరిస్థితులతో జలం జాడ లేకుండా పోయింది. వెలిగల్లు జలాశయంలోకి కూడా పెద్దగా నీరు రాలేదు. పాపఘ్ని వెలవెలబోయి కళాహీనంగా కన్పిస్తోంది.
- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, ఒంటిమిట్ట


పెండ్లిమర్రి మండలం నందిమండలం సమీపంలో నీటి జాడ లేని పాపఘ్ని నది

ఆరుగురు రెవెన్యూ సిబ్బందిపై కొరడా

◆ అవినీతి నిరోధకశాఖ సిఫార్సుతో చర్యలు
◆ అందరూ బి.మఠంలో పనిచేసిన వారే

ఈనాడు, కడప: బ్రహ్మంగారిమఠం తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అవినీతి నిరోధకశాఖ సిఫార్సు చేసింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. వైకాపా హయాంలో 2020 జనవరి 24న అనిశా దాడులు చేసిన సమయంలో అక్రమంగా నగదు కలిగి ఉన్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా అక్రమాలు, అవినీతిని నిగ్గు తేల్చి అభియోగాలు నమోదు చేశారు. ఇందులో భాగంగా అప్పట్లో తహసీల్దారుగా పనిచేసిన ఎం.దైవాదీనం (ప్రస్తుతం సుండుపల్లె), డిప్యూటీ తహసీల్దార్ చంద్రలీల (బద్వేలు ఆర్డీవో కార్యాలయం), సీనియర్ అసిస్టెంట్ వెంకట రమణ (ఎలక్షన్ సెల్, బద్వేలు) రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాగాల యానాదయ్య (బద్వేలు ఆర్డీవో కార్యాలయం), జూనియర్ అసిస్టెంట్ నాగేంద్రకుమార్ (పౌరసరఫరాలశాఖ, కడప), వీఆర్‌ఏ కాశీం పీరా (సోమిరెడ్డిపల్లె)లపై సర్వీసు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పింఛన్లు నిలిపివేయడం, ఇంక్రిమెంట్లు రద్దు తదితర చర్యలుంటాయని ఉత్తర్వుల మేరకు తెలుస్తోంది.

ఎస్ఈగా చెన్నకేశవరెడ్డికి ఉద్యోగోన్నతి

ఈనాడు, కడప: ప్రజారోగ్యశాఖలో ప్రొద్దుటూరు ఈఈగా పనిచేస్తున్న ఎన్.చెన్నకేశవరెడ్డికి ఎస్ఈగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు పైఉత్తర్వులు ఇచ్చారు. అయితే పోస్టింగ్ ఇవ్వలేదు. ఈఈగా దీర్ఘకాలికంగా కడపలో పనిచేశారు. జిల్లాలోని వైకాపా నేతకు సమీప బంధువైన చెన్నకేశవరెడ్డి కడప నగరపాలక సంస్థ ఎస్ఈగా పనిచేయడానికి ముమ్మర యత్నాలు చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కబలిస్తున్నది సుపరిచితులే!

న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు

రాయలసీమ జిల్లాల్లో మదనపల్లె పట్టణానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి వాతావరణం, నివాస సదుపాయాలు అన్ని వర్గాల వారికి అనుకూలం. ఆంధ్రా- కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఈ పట్టణ వాతావరణానికి చాలామంది ఉద్యోగులు అలవాటుపడి విశ్రాంత సమయంలో ఇక్కడే శేష జీవితాన్ని గడపడానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అలా బయటి ప్రాంతాల నుంచి వచ్చిన విశ్రాంత ఉద్యోగులు, వివిధ ప్రాంతాల ధనవంతులు అనేక మంది జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు ఉన్న పట్టణం మదనపల్లె. వీరి పిల్లలు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో స్థిరపడి విదేశాల్లో, వివిధ రాష్ట్రాల్లో, పక్క జిల్లాల్లో నివాసం ఉంటున్నారు. సొంతిల్లు, అన్ని సదుపాయాలు ఉండడంతో బిడ్డలను వదిలి ఎక్కువ మంది వృద్ధులు ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఒంటరిగా జీవనం సాగిస్తున్న ఇలాంటి వారి భద్రత, రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. విశ్రాంత ఉద్యోగులు కావడం, పిల్లలు బయట ప్రాంతాల్లో ఉండి నిర్వహణకు కొంత డబ్బు పంపడం, వారికి అందుతున్న పింఛను తదితర సదుపాయాల వల్ల విలాసవంతమైన ఇంటి నిర్మాణాలతో జీవనం సాగిస్తున్నారు. బిడ్డలు ఎక్కడో ఉండటం వల్ల వీరిని పట్టించుకునేవారే కరవౌతున్నారు.

ఒంటరి వృద్ధులు... వారికి అన్న దిక్కు ఉండదు... దాడిని ప్రతిఘటించే శక్తి శూన్యం... వారి వద్ద ఉన్న సొత్తు, సొమ్ములు సులభంగా దోచుకోవచ్చు... అభిమానం, ప్రేమ, ఆప్యాయతలకు దూరంగా వారిని నమ్మించి బుట్టలో వేసుకోవడం సులభం.. అవసాన దశలో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతుంటాయి వారిని ఆసుపత్రులకు తీసుకెళ్లడం, అవసరమైన సరకులు తెచ్చివ్వడం ద్వారా సన్నిహితంగా ఉంటూ అవకాశం చూసుకుని క'బలి'స్తున్నారు. నిందితులు ఎవరో కొత్తవారు కాదు... వారికి తెలిసిన వారు, పరిచయం ఉన్న వ్యక్తులు, బంధువులూ ఇలా చుట్టూ ఉన్న వారే. మదనపల్లెలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం సీఐ నాగేంద్ర ప్రసాద్ తల్లి స్వర్ణకుమారి దారుణహత్యతో ఈ విషయం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అందుకే ఒంటరి వృద్ధులూ తస్మాత్ జాగ్రత్త, వారికి దూరంగా ఉన్న బిడ్డలూ మీ తల్లిదండ్రుల రక్షణ మీ బాధ్యత.

14567 వయో వృద్ధుల సహాయార్థం ఏర్పాటు చేసిన 14567 టోల్‌ఫ్రీ నంబరు పని చేయడం లేదు.

జిల్లాలో విశ్రాంత ఉద్యోగులు 4 వేల మంది

మదనపల్లెలో నివాసం ఉన్నది : 2,500 మంది

● పోలీసు కుటుంబాలకే రక్షణ కరవు

● ఒంటరి వృద్ధులూ... తస్మాత్ జాగ్రత్త

స్వర్ణకుమారి హత్యతో ఉలిక్కి పడ్డ వృద్ధులు

మదనపల్లెలోని జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారి కుమారుడు నాగేంద్రప్రసాద్ ధర్మవరంలో సీఐగా విధులు నిర్వహిస్తున్నాడు. స్వర్ణకుమారి చాలాకాలంగా సొంతిల్లు నిర్మించుకుని ఒంటరిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తనకు తెలిసిన, స్వగ్రామానికి చెందిన వెంకటేష్‌ను బిడ్డకంటే ఎక్కువగా చూసుకుంటూ అతనితో ఇంటికి అవసరమైన వస్తువులు తెప్పించుకునేది. ఆమె ఒంటరిగా ఉండటాన్ని అవకాశంగా తీసుకునే అతడు తన స్నేహితుడితో కలిసి హత్యకు ఒడిగట్టాడు. ఆమె కుమారుడు పోలీసు అని తెలిసి కూడా నిందితుడు ఇంతకు తెగించాడంటే ఇక సాధారణ వయో వృద్ధుల పరిస్థితేమిటో అర్థం చేసుకోవచ్చు. సీఐ తల్లికే రక్షణ లేదంటే ఇక మాలాంటి వారి పరిస్థితి ఏమిటని ఉలిక్కిపడ్డారు. ఎప్పుడు ఏ సంఘటన జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఇలా చేస్తే మంచిది

చాలా మంది విశ్రాంత ఉద్యోగులు సంఘాల్లో ఉండటం వల్ల తరచూ సంఘం ప్రతినిధులతో మాట్లాడుతుంటారు. అలాగే ఎవరికైనా సమస్య వస్తే వెంటనే విశ్రాంత ఉద్యోగులు సంఘం సభ్యుల ఇంటికి వెళ్లి వారిని పలకరించి వస్తారు. అవసరమైతే వారిని ఆసుపత్రికి తరలించడం, పిల్లల నుంచి సమస్య వస్తే వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం చేస్తారు. కాబట్టి వృద్ధులంతా ఏదో ఒక సంఘంలో సభ్యులుగా చేరడం, నిత్యం సభ్యులతో మాట్లాడటం, సమావేశాలకు హాజరు కావడం, అందరూ కలిసి ఉదయపు నడక, సాయంత్రం సమావేశాలకు వెళ్లడం ఉత్తమం. ఇలా చేయడం వల్ల ఎవరైనా ఒక రోజు కలవకుంటే వారికి సంఘ సభ్యులు ఫోన్ చేసి మాట్లాడటమో, వారి ఇంటికి వెళ్లి చూడటమో చేస్తారు. ఇలా చేయడం వల్ల ఒంటరి వృద్ధులకు రక్షణ ఉంటుంది.

● పిల్లలు ఉద్యోగరీత్యా బయట ప్రాంతాలకు వెళ్తారు కాబట్టి చాలా మంది వృద్ధులు తమ స్వగ్రామంలోనే ఉండాలని నిర్ణయించుకుంటారు. అలాంటి సమయంలో ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని వాటిని పర్యవేక్షణ తమ ఇంట్లో ఉంచుకోవడంతో పాటు పిల్లలకు ఇవ్వాలి.

కొన్ని ఉదాహరణలివి

● గత నెల 28వతేదీ మదనపల్లె పట్టణంలోని జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారి (62)ని ఆమె ఎదురింట్లో ఉండే వెంకటేష్ నగల కోసం తన స్నేహితుడు అనిల్‌తో కలిసి దారుణంగా హత్య చేశాడు. ● మదనపల్లె పట్టణ శివార్లలోని పప్పిరెడ్డిపల్లెకు చెందిన వృద్ధురాలు ఇటీవల తెల్లవారుజామున చిల్లర దుకాణం తెరిచేందుకు వెళ్లగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. ● మదనపల్లె పట్టణంలోని ఎన్టీఆర్ లేఅవుట్‌కు చెందిన ఓ వృద్ధుడు చిల్లర దుకాణం నిర్వహిస్తాడు. మోతీనగర్‌కు చెందిన ఇద్దరు యువకులు సిగరెట్టు కొనుగోలు చేసేందుకు వచ్చారు. ఒంటరిగా దుకాణంలో ఉన్న వృద్ధుడిపై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారు. వృద్ధుడు వారం రోజుల పాటు ఆసుపత్రిలో ఉండి మృత్యువాతపడ్డాడు.

సంఘం ద్వారా బాగోగులు చూస్తాం



ఎవరైనా ఒంటరి వృద్ధులు అనారోగ్యంతో బాధపడుతున్నా, పిల్లల నుంచి దూరంగా ఉండటం వారితో ఇబ్బందులు పడుతున్నా మాకు సమాచారం ఇస్తే ఇంటికి వచ్చి వారికి అవసరమైన సహాయం అందిస్తాం. ఇది వరకు ఓ వృద్ధుడికి కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నా పట్టించుకోకుండా వంటమనిషిని పెట్టి వదిలేశారు. అతను అనారోగ్యంతో బాధపడుతుంటే పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఇప్పుడు బాగా చూసుకుంటున్నారు. **- ముని గోపాలకృష్ణ, వయో వృద్ధుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మదనపల్లె**


2022 ఫిబ్రవరి 26న ఇడుపులపాయలో నిర్వహించిన 5వ స్నాతకోత్సవానికి హాజరైన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు (పాతచిత్రం)

పట్టాలెక్కని ట్రిపుల్‌ఐటీ స్నాతకోత్సవాలు

● రాష్ట్రవ్యాప్తంగా నాలుగింట ఇదే పరిస్థితి
● 8 వేల మంది విద్యార్థుల ఎదురుచూపు

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు రెండేళ్లుగా స్నాతకోత్సవాలు నిర్వహించడం లేదు. దీంతో ఆయా ట్రిపుల్‌ఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన 8 వేల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. వర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 24 వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్నారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీ నుంచి ఏటా వెయ్యి మంది విద్యార్థులు బీటెక్ పూర్తి చేస్తున్నారు. సాధారణంగా నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఏదో ఒకచోట ఏటా స్నాతకోత్సవం నిర్వహించి సీఎం, గవర్నర్, మంత్రులు, ప్రముఖ విశ్వవిద్యాలయాల అధ్యాపకులను అతిథులుగా ఆహ్వానించి వారి సమక్షంలో విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందిస్తుంటారు. అయితే 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి నాలుగు ట్రిపుల్ ఐటీల్లో స్నాతకోత్సవాలు నిర్వహించలేదు. దీంతో 8 వేల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు. సాధారణంగా బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆ ఏడాదే పట్టాలు అందించాల్సి ఉండగా, రెండేళ్లుగా వర్సిటీ అధికారులు ఆ ఊసే మరిచిపోయారు. స్నాతకోత్సవానికి మంచి వేదిక ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆహ్వానించి ప్రముఖుల సమక్షంలో పండగ వాతావరణంలో డిగ్రీ పట్టాలు అందించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. వర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యార్థులు రెండేళ్లుగా స్నాతకోత్సవానికి దూరమయ్యారు. ఈ విషయమై ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్‌ను వివరణ కోరగా... ట్రిపుల్‌ఐటీలో స్నాతకోత్సవం ఏర్పాటుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

శివ కామిని... శుభకారిణి


రాయచోటి వీరభద్రాలయంలో సరస్వతి దేవి అలంకారంలో భద్రకాళీదేవి

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం అమ్మవారు చదువుల తల్లి సరస్వతిగా భక్తులకు దర్శనమిచ్చారు... జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో తెల్లటి దుస్తుల్లో తేజోమయ రూపిణిగా జగన్మాత భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో సరస్వతీ దేవిని పూజిస్తే విద్యా, బుద్ధులను ప్రసాదిస్తుందని, జ్ఞానరాశులను ప్రసాదిస్తుందని భక్తుల నమ్మిక. పలు ఆలయాల్లో కాళరాత్రిగా అమ్మవారిని అలంకరించారు. ప్రధాన ఆలయాల్లో అమ్మవారి దేదివ్య రూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి. **- న్యూస్‌టుడే, అన్నమయ్య బృందం**


పీలేరులో భక్తిపాటలు ఆలపిస్తున్న మహిళలు


రైల్వేకోడూరు అమ్మవారిశాల వద్ద బిందె సేవలో ఆర్యవైశ్యులు


మదనపల్లెలోని శ్రీజ్ఞానాంబికా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు


పుల్లంపేట శివాలయంలో సరస్వతీదేవి అలంకరణలో పర్వతవర్ధినీదేవి


కలకడ కోనలో సరస్వతిదేవిగా చౌడేశ్వరీదేవి

వంట నూనెల విక్రయ కేంద్రాల ఏర్పాటు

రాయచోటి, న్యూస్‌టుడే: మార్కెట్‌లో పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని పేదల కోసం తక్కువ ధరలకు నాణ్యమైన వంట నూనెల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి, మదనపల్లె రైతుబజార్లతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టోకు వర్తకుల దుకాణాలలో 16 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో పామాయిల్ లీటరు రూ.121, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.128, రూ.130లను ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తామన్నారు. ఆధార్‌కార్డుపై ఒక్కొక్కరికి లీటరు చొప్పున విక్రయించనున్నట్లు వివరించారు. రాయచోటిలోని రైతుబజార్, అంజలీ ట్రేడర్స్, ఎస్ఎస్ ఆయిల్స్, ఎంకె ట్రేడర్స్, మిస్బా ట్రేడర్స్, ఏ-1 అక్రమ్ ఆయిల్స్, ఇబ్రహీం ఆయిల్స్, జేఎస్ ట్రేడర్స్, శ్రీహనుమాన్ ట్రేడర్స్, బీఎస్‌కె ట్రేడర్స్‌తో పాటు మదనపల్లెలోని అప్పారావు వీధిలో ఉన్న రాధాకృష్ణ ట్రేడర్స్, విష్ణు ట్రేడర్స్, బాలాజీ ట్రేడింగ్ కంపెనీ, నామా ట్రేడర్స్‌లో ఈ నూనెలు నిర్ణీత ధరలకు విక్రయిస్తామన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

చేనేత... ఏదీ చేయూత?

నీరుగట్టువారిపల్లెకు తీరని అన్యాయం ◆ గత వైకాపా పాలనలో తీవ్ర సంక్షోభం

అగ్గిపెట్టెలో పట్టు చీరని అందంగా మడతపెట్టి ఒదిగిపోయేలా ఎంతో చిక్కదనంతో తయారు చేయడంతో అంతర్జాతీయ కీర్తి సొంతం చేసుకున్నారు చేనేత కళాకారులు. పొద్దంతా ఇంటిల్లిపాది శ్రమించినా పూట గడవటం గగనం. వేల కుటుంబాల్లో ఆకలి పోగుల కేక ప్రతిధ్వనిస్తోంది. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న చేతి వృత్తుల పునరుజ్జీవం దిశగా అడుగులు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా అందులో చేనేత గ్రామం నీరుగట్టువారిపల్లె పేరు కన్పించకపోవడం ఆ వర్గాలను బాధిస్తోంది. వేలాది మంది కార్మికులున్న మదనపల్లెలో డ్వాక్రా మహిళలను భాగస్వామ్యం చేసి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే 'స్ఫూర్తి' కార్యక్రమానికి శ్రీకారం చుడితే అతివల ఉపాధికి భరోసా ఉంటుందని చెబుతున్నారు. జిల్లా పేరు ప్రస్తావించేలా కూటమి నాయకులు తగిన చొరవ చూపాలని కోరుతున్నారు.


నీరుగట్టువారిపల్లెలో ఏర్పాటు చేసిన చేనేత మగ్గం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం 10 క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే చేనేత పట్టుచీరల తయారీలో గుర్తింపు ఉన్న మదనపల్లెకు ఆ జాబితాలో చోటుదక్కకపోవడంపై స్థానిక నేతన్నలు నిరాశ చెందుతున్నారు. రాయలసీమలో ధర్మవరం తర్వాత పట్టుచీరల తయారీకి ప్రసిద్ధి చెందిన మదనపల్లె సమీప నీరుగట్టువారిపల్లెకు తీరని అన్యాయం జరిగిందని వాపోతున్నారు. క్లస్టర్ మంజూరైతే కొన్ని వేల మందికి ఉపాధి లభించడంతో పాటు, మెరుగైన శిక్షణ లభించి ఉండేదని అంటున్నారు.

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షోభం

మదనపల్లె పట్టణ సమీపంలోని నీరుగట్టువారిపల్లెలో 1983లో ప్రారంభమైన పట్టుచీరల తయారీ పరిశ్రమ 15 వేలకు పైగా మగ్గాలతో వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేనేతను విస్మరించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ రంగంలో తలెత్తిన సంక్షోభంతో ఉత్పత్తులు పడిపోయి వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి. చేనేత మగ్గాలు సగానికి సగం మూసివేయబడ్డాయి. ప్రస్తుతం 8 వేల వరకు మగ్గాలున్నట్లు సమాచారం. చేనేత రంగంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 30 వేల మందికిపైగా పనిచేస్తున్నారు.

నేతన్నల చిరకాల కోరిక నెరవేరేదెలా?

నీరుగట్టువారిపల్లెలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలన్నది నేతన్నల చిరకాల కోరిక. అలాగే ఇక్కడ తయారయ్యే చీరలకు బ్రాండ్ పొందేందుకు గత కొన్నేళ్లుగా నుంచి పోరాటం చేస్తున్నారు. 100 నుంచి 200 మంది కార్మికులను ప్రాతిపదికగా తీసుకుని క్లస్టర్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. పక్క జిల్లాలైన తిరుపతి, అనంతపురంలో రెండేసి చొప్పున చేనేత క్లస్టర్లు మంజూరు చేశారు. జిల్లాలో మాత్రం ఒక్కటి కూడా ఇవ్వలేదు. క్లస్టర్ ఏర్పాటు వల్ల అధునాతన డిజైన్లలో శిక్షణ పొందడానికి అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం క్లస్టర్ నిర్వహణకు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులను కార్మికుల కోసం మూడేళ్లలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. క్లస్టర్ పరిధిలోని నేతన్నలకు రూ.15 వేలు నుంచి రూ.70 వేలు విలువైన అధునాతన పరికరాలు 90 శాతం రాయితీతో అందిస్తారు. ఇందులో మగ్గం ఫ్రేము, మోటరైజ్డ్ జాకార్డు, 120/140 జాకార్డు మిషన్, అచ్చు సెట్టు, నూలు వడికే, చుట్టే యంత్రాలు వంటివి ఇవ్వడం జరుగుతుంది. ఇందులో 10 శాతం నిధులను నేతన్నలు చెల్లించాల్సి ఉంటుంది. క్లస్టర్ల ద్వారా కార్మికులకు నూతన డిజైన్లపై శిక్షణ ఇచ్చేందుకు ఒక డిజైనర్‌ను అందుబాటులో ఉంచుతారు. స్థానికంగా ఉన్న డిజైనర్లు కొంతమంది వేలకు వేలు ఖర్చు చేసి బయట ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారు. ఇన్ని సౌకర్యాలు ఉన్న క్లస్టర్‌ను మదనపల్లెకు ఇవ్వకపోవడం దురదృష్టకరమని నేతన్నలు అంటున్నారు. ప్రభుత్వం క్లస్టర్ మంజూరు చేసి సంక్షోభం నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడి మృతి


కిరణ్‌కుమార్ (పాత చిత్రం)

గాలివీడు, న్యూస్‌టుడే: వడిశలవంక పల్లె సమీపంలో బుధవారం ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడ్డారు. చిన్నమండెం మండలం జంగంపల్లెకు చెందిన వరుణ్‌కుమార్ (25) ద్విచక్ర వాహనంలో గాలివీడుకు వెళ్తుండగా అదే మార్గంలో వెళ్తున్న ఓ ట్రాక్టరు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి బంధువులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలు...

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన రామసముద్రం మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. మండల పరిధిలోని చెంబకూరు పంచాయతీ ఎగువపల్లెకు చెందిన వెంకటలక్ష్మమ్మ (70) ఈ నెల 8న పుంగనూరులో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి స్వగ్రామానికి బస్సులో వచ్చి దిగువపల్లె బస్‌స్టాప్ వద్ద దిగింది. అక్కడి నుంచి ఎగువపల్లెలోని ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా యువకుడు ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహానికి బుధవారం శవపరీక్షల అనంతరం బంధువులకు అప్పగించారు. మృతురాలి కుమారుడు రమణప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

చికిత్స పొందుతూ వీఆర్వో...


శివయ్య (పాతచిత్రం)

చిన్నమండెం : గొర్లముదివేడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీఆర్వో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. వండాడి గ్రామం తూర్పుపల్లి దళితవాడకు చెందిన శివయ్య (50) వెలిగల్లు వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఇటీవల శివయ్య సంబేపల్లె మండలానికి బదిలీ అయ్యారు. ఆ క్రమంలో ఈ నెల 6వ తేదీ ఆదివారం గాలివీడు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి సాయంత్రం కుమారుడి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా గొర్లముదివేడు సమీపంలోకి వెళ్లగానే వీరి వాహనాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివయ్య తీవ్రంగా గాయపడగా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య


ఆదినారాయణ (పాతచిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఆటో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో బుధవారం జరిగింది. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన ఆదినారాయణ (50) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. వీరి స్వగ్రామం వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామం. కొంతకాలం క్రితం నిమ్మనపల్లె మండలానికి వచ్చారు. ఈయనకు భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలకు ఇద్దరికి వివాహాలు చేశారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబంలో నెలకొన్న సమస్యలతో ఇతను ఈ నెల 8న తేదీ ఇంట్లో నుంచి వెళ్లారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తన ఆటోలోనే మదనపల్లె రామసముద్రం మార్గంలోని పెంచుపాడు పంచాయతీ కృష్ణాపురానికి సమీపంలోకి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గతంలోనూ ఈయన కుటుంబ సమస్యలతో చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించారు. చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్ఐ మహదేవ్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్ రామ్మూర్తిలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆదినారాయణ మృతి చెందిన ప్రాంతానికి సమీపంలోనే ఆటో ఉండటంతో దాన్ని స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రి శవాగారానికి తరలించారు. మృతుడి సోదరుడు సాంబశివ ఫిర్యాదు మేరకు ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వైకాపా చెత్తపన్ను... కూటమి వెన్నుదన్ను

రద్దుతో పట్టణ ప్రజలపై తప్పిన భారం

నెలకు రూ.35 లక్షలకుపైగా నాడు వసూళ్లు


పురపాలక కార్యాలయంలో క్లాప్ వాహనాలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న అయిదేళ్ల ప్రజలపై పన్నుల భారం మోపి దోచుకొన్నారు. ప్రత్యేకించి పురపాలక సంఘాల్లో చెత్తపై పన్ను వేసి ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూల భారం చేసి ఖజానా నింపుకొన్నారు. దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినా సరే పురపాలక సంఘం సిబ్బంది చేత బలవంతపు వసూళ్లు చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీన్ని రద్దు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటనతో పట్టణ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ ప్రజలకు ఉపశమనం

మదనపల్లె పురపాలక సంఘం పరిధిలోని 35 వార్డుల్లో అధికారిక లెక్కల ప్రకారం 30 వేల ఇళ్లు ఉన్నాయి. ఇందులో అధికారికంగా 1,35,639 మంది జనాభా నివాసం ఉండగా అనధికారికంగా మరో 1.70 లక్షలు పైబడి ఉండొచ్చని అంచనా. నివాస గృహాలు, నివాసేతర, వ్యాపార భవనాలు, మురికివాడలుగా పురపాలక సంఘం అధికారులు నోటిపై చేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చెత్త పన్ను వసూలు చేయడానికి చర్యలు చేపట్టింది. యూజర్ ఛార్జీలు వసూలు చేయడానికి సులువుగా నాన్ స్లమ్, స్లమ్, కమర్షియల్ కేటగిరీలుగా మూడు విభాగాలుగా కేటాయించారు. నాన్ స్లమ్ కింద 20 వేలు, స్లమ్ 10 వేలు, కమర్షియల్ కింద 3 వేలు నివాసాలున్నట్లు గుర్తించారు. నాన్‌స్లమ్ కేటగిరి కింద ఇంటికి నెలకు రూ.60, స్లమ్ కేటగిరికి రూ.30 ధర నిర్ణయించారు. పురపాలక సంఘం పరిధిలోని 35 వార్డుల్లో వెలువడే చెత్తను ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం (కంపోస్టు యార్డు)కు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పథకం కింద 33 వాహనాలు మంజూరు చేసింది. మొదటి విడత కింద 15 వాహనాలు ఇచ్చింది. వీటి ద్వారా 26 వార్డుల్లో మాత్రమే ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. పురపాలక సంఘం ఒక్కో వాహనానికి నెలకు రూ.65 వేలు చొప్పున 33 వాహనాలకు రూ.22.11 లక్షలు చెల్లించాలి. ప్రస్తుతం 15 వాహనాలకు రూ.9.75 లక్షలు చెల్లిస్తున్నారు. రాయచోటి పురపాలికలో 25 వేల అసెస్‌మెంట్లు ఉండగా, 30 వేల ఇళ్లపైడి ఉన్నాయి. రాజంపేట పురపాలికలో 15 వేలపైబడి అసెస్‌మెంట్లు ఉండగా, 25 వేల ఇళ్లు ఉన్నాయి.

పురపాలిక	జనాభా	క్లాప్ వాహనాలు	చెల్లింపులు (లక్షల్లో)	చెత్త (టన్నుల్లో)
మదనపల్లె	1,70,000	15	9,75,000	70
రాయచోటి	1,25,000	25	16,25,000	45
రాజంపేట	1,27,000	15	9,75,000	40

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం



పురపాలక సంఘంలో చెత్త పన్నును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేయడం చాలా సంతోషం. 2021 నుంచి 2024 వరకు ప్రతి కుటుంబం నుంచి రూ.30 నుంచి రూ.60 వరకు ప్రతి నెలా వసూలు చేశారు. వాణిజ్య కార్యాలయాలు, హోటళ్ల నుంచి రూ.3 వేల నుంచి రూ.6 వేలు వరకు వసూలు చేశారు. కూటమి ప్రభుత్వం చెత్తపన్ను రద్దు చేయడంతో ప్రజలపై ఆర్థికభారం తగ్గింది.

- అరుణ్‌తేజ, మదనపల్లె

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నిమ్మనపల్లె వారపుసంతలో నాబార్డు నిధులు, గాంధీ గ్రామీణాభివృద్ధి సంస్థ సమన్వయంతో రూ.16.50 లక్షలతో నిర్మించిన నీడ షెడ్లు, కార్యాలయం, మరుగుదొడ్లు, సోలార్ విద్యుత్తు వంటి వాటిని సర్పంచి పాపులమ్మ అధ్యక్షతన ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.3 కోట్లతో సిమెంటు రహదారులు, మురుగు కాలువలకు పెద్ద ఎత్తున నిధులు వ్యయం చేయనున్నట్లు చెప్పారు. నిమ్మనపల్లె బస్టాండులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఉన్నాయని వీటిని పూర్తిస్థాయిలో నివారించి ప్రజా పాలన సాగిస్తామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎటువంటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. మెగా డీఎస్సీ ద్వారా పెద్ద ఎత్తున 16,347 ఉద్యోగాల జాతరకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నిమ్మనపల్లెలో డిగ్రీ కళాశాల అవసరం ఉందని ఈ విషయమై విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీజీఎం ఎంఎస్ఆర్‌మూర్తి, డీడీఎం విజయవిహారి, గార్డు సంస్థ ప్రతినిధి రమాదేవి, తహసీల్దారు ధనంజయులు, ఈవో పీఆర్డీ చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, తెదేపా నాయకులు మల్లప్ప, పుత్రావెంకటరమణ, రాజన్న, మేసరామకృష్ణ, రెడ్డెప్పరెడ్డి, జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, తోటకల్యాణ్, ఈతకట్ట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, వేదికపై కూటమి నాయకులు

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ

రాయచోటి, న్యూస్‌టుడే: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి జయప్రకాష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్సీ శిక్షణ సంస్థలను ఎంపానెల్ చేసేందుకు వివరాలతో కూడిన డాక్యుమెంట్స్‌తో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 21వ తేదీలోపు ఆసక్తి ఉన్న శిక్షణ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

మూఢ నమ్మకాలే ప్రాణాలు తీశాయి

- నగల కోసమే ధర్మవరం సీఐ తల్లి స్వర్ణకుమారి దారుణ హత్య
- నిందితుడి వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : 'వయసు రీత్యా వచ్చే అనారోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు మూఢ నమ్మకాలను అనుసరించడమే స్వర్ణకుమారి ప్రాణాలు తీశాయి. తనకు పరిచయం ఉన్న కుటుంబానికి చెందిన యువకుడే శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం సీఐ తల్లిని హత్య చేశాడు' అని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. మదనపల్లెలో సంచలనం సృష్టించిన ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి పేరం స్వర్ణకుమారి (63) హత్య కేసులో నిందితుడు వెంకటేష్‌ను బుధవారం అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... స్వర్ణకుమారి కుమారుడు నాగేంద్రప్రసాద్ ఉద్యోగ రీత్యా ధర్మవరం సీఐగా పనిచేస్తుండగా ఆమె మదనపల్లెలోనే ఉంటున్నారు. వీరి ఇంటి పక్కనే ఉండే వెంకటేష్ స్వగ్రామానికి చెందిన యువకుడే కావడంతో ఏదైనా తెప్పించుకోవాలన్నా, ఎక్కడైనా వెళ్లాలన్నా అతని సాయం తీసుకునే వారు. వెంకటేష్, అతని స్నేహితుడు అనిల్ ఆర్థిక సమస్యలతో స్వర్ణకుమారి నగలు కాజేయాలని పథకం వేశారు. ఆమెకున్న మూఢ నమ్మకాలను అలుసుగా తీసుకుని తన స్నేహితుడి ఇంటికి స్వామీజీ వచ్చాడని అతను మంత్రిస్తే జబ్బులు తగ్గిపోతాయని నమ్మబలికి గత నెల 28న తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళ్లాడని చెప్పారు. ఆమెను నీరుగట్టువారిపల్లెలోని సాయిరాం వీధిలోని తన స్నేహితుడు అనిల్ ఇంటికి తీసుకెళ్లి పథకం ప్రకారమే కొబ్బరి నీళ్లలో మత్తుమందు కలిపి ఇచ్చారు. స్పృహ కోల్పోవడంతో సుత్తితో తలపై కొట్టి చంపేశారు. అదే రోజు ఆమె నగలన్నీ తీసుకుని స్థానిక ఫైనాన్స్ సంస్థలో రూ.4.97 లక్షలకు కుదువ పెట్టారు. తన తల్లి కనపడకపోవడంతో కుమారుడు నాగేంద్రప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 2న అదృశ్యం కేసు నమోదు చేసి పలు బృందాలతో విచారణ ప్రారంభించాం. సాంకేతిక ఆధారాలతో వెంకటేష్‌ను నిందితుడిగా గుర్తించి అతని కోసం గాలిస్తుండగా మంగళవారం మదనపల్లె - బెంగళూరు మార్గంలోని చీకలబైలు చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేశాం. నిందితుడిచ్చిన సమాచారంతో మృతదేహాన్ని వెలికి తీసి శవపరీక్ష అనంతరం అక్కడే అంత్యక్రియలు నిర్వహింపజేశాం' అని తెలిపారు. ఈ కేసులో ఫైనాన్స్ సంస్థలో పెట్టిన నగలను రికవరీ చేసినట్లు తెలిపారు. స్వర్ణకుమారి మృతదేహాన్ని సాయిరాం వీధి నుంచి అయోధ్యనగర్ శ్మశానానికి తరలించిన అద్దె కారును జప్తు చేశామన్నారు. వెంకటేష్‌ను అరెస్టు చేశామని ఈ కేసులో నిందితులుగా ఉన్న అనిల్, హత్యకు సహకారం అందించిన అతని తల్లి రమాదేవి, ఫైనాన్స్ సంస్థ నుంచి తెచ్చిన డబ్బులో రూ.లక్ష తీసుకున్న వెంకటేష్ తల్లి ఎల్లమ్మలను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. వెంకటేష్‌పై పీలేరు, మదనపల్లెల్లో పలు కేసులున్నాయని స్పష్టం చేశారు. గంజాయి మత్తులో హత్య చేశారని సమాచారం ఉందని విలేకరులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా వెంకటేష్ గంజాయి తీసుకోవడంతో పాటు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని చెప్పారు. నిందితులను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన సీఐ కళా వెంకట రమణ, సాంకేతిక నిపుణుడు రాఘవరెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది మహమ్మద్, నరసింహులు, రఘునాథ్‌రెడ్డిలకు జిల్లా ఎస్పీ రివార్డులు అందజేశారు.


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ఎస్పీడీసీఎల్ ఎస్ఈగా చంద్రశేఖర్‌రెడ్డి



రాయచోటి, మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా జిల్లా నూతన సర్కిల్ ఏర్పాటు కావడంతో ఎస్ఈ పోస్టును కేటాయించారు. తిరుపతి ప్రాజెక్ట్స్ కార్పొరేషన్ కార్యాలయంలో జీఎంగా పని చేస్తున్న ఆయన్ను ఎస్ఈగా నియమించారు. గతంలో కడప సర్కిల్ పరిధిలో ఉన్న జిల్లాను ప్రభుత్వం వేరు చేసి అన్నమయ్య జిల్లా పూర్తిస్థాయి సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రెగ్యులర్ ఎస్ఈని నియమించడంతో జిల్లాలో విద్యుత్తు సమస్యల సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుందని ఎస్పీడీసీఎల్ అధికారులు పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువు పెంపు

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పెంచిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 111 దుకాణాలకు ఇప్పటి వరకు 1,110 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఒకే దుకాణానికి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. లక్కీ డ్రా తేదీని 11వ తేదీ నుంచి 14వ తేదీకి మార్చామన్నారు. ఈ మార్పులను దరఖాస్తుదారులు గమనించాలన్నారు.

వ్యాధుల నివారణకు కృషి

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో క్షయ, కుష్ఠు నివారణకు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు కృషి చేయాలని జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శైలజ అన్నారు. బుధవారం సాయంత్రం త్యాగరాజువీధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ, కుష్ఠు వ్యాధిగ్రస్తులను ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు వారు సకాలంలో మందులు మింగేలా చూడాలన్నారు. టీబీ రహిత భారత్ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబు, క్షయవిభాగం అధికారి డాక్టర్ శ్రీధర్, ప్రోగ్రాం సమన్వయకర్త చెన్నారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ మోహిత్‌రెడ్డి, క్షయ విభాగం సిబ్బంది ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, పక్కన వైద్యులు

వైకాపా నాయకుడి ఇంట్లో భారీగా టపాసులు స్వాధీనం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వైకాపా నాయకుడి ఇంట్లో బుధవారం రాత్రి భారీగా టపాసులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలోని కాట్లాటపల్లె రోడ్డులో పెద్ద ఎత్తున టపాసులు ఉన్నాయని సమాచారం రావడంతో ఒకటోపట్టణ సీఐ చాంద్‌బాషా, ఎస్ఐ అన్సర్ బాషా, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. వైకాపా సర్పంచి కుటుంబ సభ్యుడైన బండి మనోహర్ టపాసులు తెచ్చి నిల్వ చేసినట్లు తెలుసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో వీటిని విక్రయించేందుకు తీసుకొచ్చారా.. లేక ఎవరికైనా బహుమతిగా ఇచ్చేందుకు తీసుకొచ్చారా అని పోలీసులు విచారణ చేస్తున్నారు. టపాసుల విలువ రూ.2.25లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. అనుమతిలేకుండా టపాసులు నిల్వ ఉంచాడని బండి మనోహర్‌పై కేసు నమోదు చేసి 41 నోటీసు ఇచ్చి పంపామని సీఐ తెలిపారు.


టపాసుల పెట్టెలను తనిఖీ చేస్తున్న సీఐ చాంద్‌బాషా, సిబ్బంది

జాతీయ క్రీడలకు విద్యార్థి ఎంపిక


స్టార్ ఆంధ్రా అవార్డు అందుకుంటున్న విష్ణువర్ధన్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు పట్టణంలోని సీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విష్ణువర్ధన్ జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలకు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్టణం జిల్లాలో జరిగిన అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరుపున ఆడిన విష్ణువర్ధన్ స్టార్ ఆఫ్ ఆంధ్రా అవార్డును సొంతం చేసుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికై వచ్చే ఏడాదిలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. తనకు సహకరించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి బాలాజి, పీలేరు సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అవినాష్‌రెడ్డికి విష్ణువర్ధన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా


విజేతలుగా నిలిచిన ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలుర జట్టు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరంలో ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలుర జట్టు ఛాంపియన్‌గా నిలిచినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు. వీరిలో సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులైన జ్యోతి ప్రకాష్, ఖుషిలు ప్రతిభ చూపారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్‌జీఎఫ్ కార్యదర్శితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, నరేష్, ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఉమ్మర్‌బాషా, గిరిధర్‌నాయక్, ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటేష్‌తో పాటు పలువురు అభినందించారు.

న్యాయం చేయాలని వేడుకోలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : తాము ఓ న్యాయవాది వేధింపులు తాళలేకున్నామని ఓ కుటుంబం బుధవారం మదనపల్లెకు వచ్చిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడికు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ బండకాడపల్లెకు చెందిన అమరనారాయణ, అతని కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో తమకు, న్యాయవాదికి మధ్య భూ వివాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ న్యాయవాది తమపై రెండు సార్లు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారన్నారు. తాము ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. న్యాయవాది, అతని అనుచరుల నుంచి తమకు ప్రాణహాని ఉందని తమకు న్యాయం చేసి రక్షణ కల్పించాలని బాధితులు అమరనారాయణ, కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అంతకు ముందు వీరు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట పెట్రోలు బాటిల్‌తో నిరసన వ్యక్తం చేసి మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

మృతదేహం స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు చర్యలు

ఈనాడు, అమరావతి: కువైట్‌లో హత్యకు గురైన వీరాంజనేయులు మృతదేహాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. 'సుండుపల్లి మండలం గడ్డమీదపల్లికి చెందిన వీరాంజనేయులు (45) జీవనోపాధి నిమిత్తం భార్య చెన్నకేశమ్మతో కలిసి కువైట్‌కు వెళ్లారు. పది రోజుల కిందట వారు ఉంటున్న నివాసంలో ఘర్షణ చోటు చేసుకుంది. ఆ తర్వాత వీరాంజనేయుల్ని ఎడారిలోకి తీసుకెళ్లి హత్య చేశారనే విషయం సోమవారం అతని భార్య అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని, చెన్నకేశవమ్మను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కడప విద్య : ప్రభుత్వం 12వ పీఆర్సీ అమలుచేయడానికి ఆలస్యమవుతున్నందున దసరా కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతరభృతి ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. శివార్జున మాట్లాడుతూ గత ప్రభుత్వం 11వ పీఆర్సీ లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రివర్స్ పీఆర్సీ ఇచ్చి తీవ్రంగా నష్టపరిచిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 12వ పీఆర్సీ లో మంచి ఫిట్‌మెంట్ ఇచ్చి ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, కార్యదర్శులు కట్టా గంగాధర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివార్జున, పక్కన సంఘం నాయకులు

అధికారుల దృష్టికి వసతి గృహాల సమస్యలు

రాయచోటి, న్యూస్‌టుడే: స్థానిక బాలుర, బాలికల వసతి గృహాలను బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సి.ఆసిఫాసుల్తాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాలలో విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఎస్సీ, బీసీ వసతిగృహాలలో తాగునీటి సమస్య ఉన్నట్లు విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కిటికీలు, మరుగుదొడ్లకు తలుపులు సక్రమంగా లేకపోవడాన్ని ఆమె గుర్తించారు. గిరిజన బాలికల వసతి గృహంలో ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నామని అక్కడి విద్యార్థిను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గుర్తించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె చెప్పారు. వసతి గృహ సంక్షేమ అధికారులు శ్రీనివాసులు, లక్ష్మీకాంతమ్మ, కోర్టు సిబ్బంది విజయ్, కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్, మురళి పాల్గొన్నారు.


బాలికల వసతి గృహంలో మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఆసిఫా సుల్తాన్

కమనీయం... బిందెసేవ మహోత్సవం

రాజంపేట, న్యూస్‌టుడే: జైజై మాత.. వాసవీమాత నినాదాలతో రాజంపేట పట్టణ వీధులు మారుమ్రోగాయి. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయం నుంచి పురవీధుల్లో బిందెసేవ మహోత్సవం కమనీయంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల వేషధారణలు, డప్పు వాయిద్యాలు, చిన్నారులు కర్రసాము విన్యాసాలు, గుర్రపు విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


పురవీధుల్లో వైభవంగా సాగుతున్న బిందెసేవ

సౌమ్యనాథుడి సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరులోని శ్రీసౌమ్యనాథస్వామి ఆలయాన్ని బుధవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఎం.లక్ష్మణ్, ఎ.లక్ష్మీనారాయణలు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అర్చకులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం శాలువాతో సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం రాజంపేట స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ ఆలయ చరిత్రను వారికి వివరించారు. సౌమ్యనాథస్వామి చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టరు దిలీప్, కోర్టు సూపరింటెండెంట్ రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు


సౌమ్యనాథుడిని దర్శించుకున్న న్యాయమూర్తులు లక్ష్మణ్, లక్ష్మీనారాయణ

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని డిమాండు


ఆందోళన చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, రైతులు

ముదివేడు (కురబలకోట) : ముదివేడు ప్రాజెక్టు రిజర్వాయర్ నిర్వాసితులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని కోరుతు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు సమీపంలో పరిహారం కోసం బుధవారం రైతులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు ఏ.రామాంజులు,. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, ముదివేడు రైతు సంఘం సభ్యులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, బాషా, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

పంటసాగుపై అవగాహన


మేడికుర్తి సమీపంలోని పొలంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పంటలకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండి ప్రారంభ దశ లోనే నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగప్రసాద్ అన్నారు. మదనపల్లె మండలం మేడికుర్తి గ్రామం సమీపంలోని పొలాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు పంటసాగులో ఎదురయ్యే పలు సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి ఈశ్వర ప్రసాద్‌రెడ్డి, సర్పంచి ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్తు తీగలు సరిజేశారు

స్పందనకు వందనం

వ్యవసాయ పొలాల వద్ద కిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలను అధికారులు సరిజేశారు. ఈ సమస్యను ఈ నెల 7న 'తీగలతో పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిజేశారు. ట్రాన్స్‌కో ఏఈ ఆదేశాల మేరకు సిబ్బంది విద్యుత్తు లైన్ కింద ఉన్న చెట్లను తొలగించి తీగలకు పైకి లాగారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

\- న్యూస్‌టుడే, ములకలచెరువు

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థితో కళాశాల యాజమాన్యం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు మదనపల్లె ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్‌బాబు తెలిపారు. కళాశాలలో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతున్న తేజవర్ధన్‌రెడ్డి ఈ నెల 7న గూడూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూ క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ క్రికెట్ పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థిని డైరెక్టర్, ప్రిన్సిపల్‌తో పాటు హెచ్‌ఓడీ వెంకటవరప్రసాద్, పీడీలు సురేంద్రబాబు, మోసెస్ ప్రవీణ్, అధ్యాపకులు అభినందించారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ములకలచెరువు, న్యూస్‌టుడే: సంఘాల్లో మహిళాలు రుణాలు పొందిసకాలంలో చెల్లిస్తే లక్షాధికారులుగా ఎదుగుతారని ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. బుధవారం తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఆరు మండలాల ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు, వివో లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టును జిల్లాలో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ఎంచుకున్నారని, నాలుగేళ్ల పాటు ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలు చిన్నచిన్న వ్యాపారులు, తన స్థాయిలో అభివృద్ధి చేసుకొని వ్యాపారాల ద్వారా రుణాలు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక అభివృద్ధి సాధించి భవిష్యత్తులో సీఎం చంద్రబాబు ఆశించిన విధంగా ప్రతి మహిళ లక్షాధికారి అయ్యేంత వరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బి.కొత్తకోట మండలంలో బుధవారం జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం దానియనిచెరువుకు చెందిన కృష్ణయ్య పెళ్లిళ్ల పేరయ్యగా పని చేస్తారు. ఈయన సొంత పని నిమిత్తం మదనపల్లెకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కాండ్లమడుగుక్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణయ్యను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని బి.కొత్తకోట పోలీసులకు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి

రామసముద్రం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ పాడిఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మూగవాడి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పొలంలో ఉన్న విద్యుత్తు తీగలు తెగి కిందపడినా సిబ్బంది పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో గడ్డి మేస్తూ విద్యుత్తు తీగలను తాకిన పాడిఆవు విద్యుదాఘాతానికి గురై సంఘటన స్థలంలోనే మృతి చెందిందని వాపోయారు. ఘటనపై ఆగ్రహించిన బాధితులు, గ్రామరైతులు కేసీపల్లె విద్యుత్తు ఉపకేంద్రం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై మదనపల్లె డీఈఈ గంగాధరాన్ని వివరణ కోరగా సంఘటనపై విచారణ చేపట్టి సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుకు న్యాయం చేస్తామని వివరించారు.

దాడి చేశారని ఫిర్యాదు

రామసముద్రం, న్యూస్‌టుడే : కేసీపల్లె విద్యుత్తు ఉపకేంద్రంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న బసవరాజ మద్యం తాగి తమపై తిట్టడంతో పాటు దాడి చేసి గాయపరిచారని రైతు రఘుతో పాటు షిఫ్ట్‌ఆపరేటర్ రమేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యుత్ ఉపకేంద్రంలో పని చేస్తూ కరెంట్ బిల్లుల వసూళ్లలోనూ రైతులపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ములకలచెరువు: మహిళ అదృశ్యంపై ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

జలజీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికి తాగునీరు

- మూడేళ్లలో అందించేలా ప్రణాళికలు
- రూ.3 వేల కోట్లతో ప్రతిపాదనలు


మదనపల్లె మండలం గుడిసివారిపల్లెలో నీరు పట్టుకుంటున్న మహిళలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీటిని అందజేయాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికతో ముందుకెళుతున్నాయి. ప్రజలు తాగునీటితో ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్‌మిషన్ (జేజేఎం) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు చేపట్టింది. ఇటీవల పల్స్ సర్వే చేయించి తాగు నీటి కుళాయి సదుపాయం లేని ఇళ్లను గుర్తించారు.

- కుళాయి కనెక్షన్ లేని ఇళ్ల సంఖ్య 4,849 మదనపల్లె గ్రామీణ నీటి సరఫరాశాఖ పరిధిలోని పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె, మూడు నియోజకవర్గాల్లో ఇటీవల పల్స్‌సర్వే నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను సేకరించారు. అందులో కుళాయి కనెక్షన్లు లేని ఇళ్లను నమోదు చేశారు. మూడు నియోజకవర్గాల్లో 4,849 ఇళ్లకు కనెక్షన్లు లేవని గుర్తించారు. వీరికి నీటి సదుపాయం ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అలాగే 2026లోపు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నదే ఈ పథకం ఉద్దేశం.
- గ్రామీణ ప్రాంతంలో నివసించే ప్రజలకు నిబంధనలు ప్రకారం ఒక వ్యక్తికి రోజుకు 40 లీటర్లు నీరు అందించాలి. వేసవి కాలంలో అయితే 15 లీటర్లు తాగు నీరు ఇవ్వాల్సి ఉంది. మిగిలిన 25 లీటర్లు ఉప్పునీరు అయినా పర్వాలేదు. అలాగే పురపాలకసంఘం పరిధిలోని వారికి 130 లీటర్లు ఇవ్వాలి. దీని ప్రకారం తాగునీరు సరఫరా జరగాలి. జేజేఎం కింద 341 బోరుబావులు తవ్వించడానికి, 1500 కి.మీ. పైపు లైను ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ఇది వరకు తాగునీటి సరఫరాకు రూ.43 కోట్లు వ్యయం చేసినట్లు సమాచారం.
- గ్రామాల్లో తాగునీరు సరఫరా చేయడానికి జలజీవన్‌మిషన్ పథకం కింద బోర్లు తవ్వకాలు, పైపులైన్లు ఏర్పాటు తదితర పనులు చేయడానికి ఇది వరకే టెండర్లు పిలిచారు. ఇందులో 1700 పనులను రద్దు చేసి వాటికి రీటెండర్లు నిర్వహించడానికి ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే 25 శాతం కంటే తక్కువ జరిగిన 150 పనులను రద్దు చేశారు. గ్రామాల్లో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గండికోట నుంచి ఈ ప్రాంతానికి తాగునీటిని సరఫరాచేయడానికి రూ.2300 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి పంపగా, తాజాగా దాన్ని రివైజ్ చేసి రూ.3వేల కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఈ ప్రాజెక్టును 3 ఏళ్లలో పూర్తిచేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారు.

త్వరలో టెండర్ల నిర్వహణ



జేజేఎం కింద పనులు చేయడానికి త్వరలో టెండర్లు నిర్వహిస్తాం. అదనంగా నీరు సరఫరా చేసేందుకు పైపులైన్లు పొడిగించడానికి ప్రతిపాదనలు పంపించాం. శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది.

\- రషీద్‌ఖాన్, నీటిసరఫరా శాఖ ఈఈ

అద్దె బకాయిలు చెల్లించాలి

మదనపల్లె పట్టణం : గత ఎన్నికల సమయంలో వినియోగించుకున్న క్యాబ్‌లకు అద్దె తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, స్థానిక నాయకుడు ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలో 37 అద్దె వాహనాలు, 7 కాన్వాయ్ వాహనాలకు అద్దె చెల్లించాల్సి ఉందన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు క్యాబ్‌డ్రైవర్లకు అద్దె బకాయిలు చెల్లించాలన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

మదనపల్లె విద్య : వెన్నెముక కండరాల క్షీణత జబ్బుతో బాధపడుతున్న చిన్నారి శ్రీనికకి తమ వంతు సాయంగా శ్రీనివాస డిగ్రీ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి సిద్ధార్థ విద్యాసంస్థల ఛైర్మన్ కృష్ణారెడ్డిలు బుధవారం రూ.23వేలు సాయం అందించారు. చిన్నారి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో వివేకానంద ఆశయం ఫౌండేషన్ వారు కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు వైద్యం కోసం నగదు సాయం అందించారు. చిన్నారికి దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని వారు పిలుపునిచ్చారు.

అమ్మరూపం... దేదీప్యం


రామసముద్రంలో పుష్పాలంకరణలో దుర్గాదేవి


గండబోయనపల్లెలో సత్యమ్మ తల్లి


నీరుగట్టువారిపల్లెలో సరస్వతి అలంకరణలో చౌడేశ్వరి


ములకలచెరువు: సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు


బి.కొత్తకోటలో బంగారు చీరతో వాసవీ అమ్మవారు


చింతపర్తిలో వాసవీమాత


నీరుగట్టువారిపల్లెలో సరస్వతీదేవిగా


పీలేరులో...


కలికిరి గ్రామీణ: సోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవి

దసరా ఉత్సవాల్లో భాగంగా మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం ఆయా ఆలయాల్లో అమ్మవార్లను సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

\- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం

పరిశ్రమల ఏర్పాటుకు కృషి


పీడీ వెంకటరత్నాన్ని సన్మానిస్తున్న తెదేపా నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, న్యూస్‌టుడే: వెనుకబడిన ప్రాంతమైన తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రజలకు ఉపాధి హామీ ద్వారా అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించడంతో పాటు వంద రోజులు పనిదినాలు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నాన్ని తెదేపా నేత జయచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం రాయచోటిలో జేసీ, పీడీలను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. బి.కొత్తకోట మండలంలో బడికాయలపల్లి సమీపంలో 2,172 ఎకరాలు, కురబలకోట మండలంలో 600 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు తెలిపారు. గుర్తించిన ప్రభుత్వ భూమి వివరాలను జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పీడీతో మాట్లాడుతూ పార్టీలకతీతంగా నియోజకవర్గంలో జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి 100 రోజులు ఉపాధి పనులు కల్పించాలన్నారు.

గ్రామాభివృద్ధి తెదేపాతోనే సాధ్యం

రామసముద్రం, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీల అభివృద్ధి తెదేపా పాలనలోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు అన్నారు. రామసముద్రం గ్రామసచివాలయంలో బుధవారం గ్రామ సర్పంచి కవితమ్మ అధ్యక్షతన దసరా వేడుకలు నిర్వహించారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గ్రామకార్యదర్శి మునస్వామి నాయక్, సచివాలయ సిబ్బందికి స్వాగతం పలికారు. గత వైకాపా పాలనలో గ్రామపంచాయతీలు నిర్వీర్యం అయిపోయాయని విమర్శించారు. మాజీ సర్పంచులు వీరప్ప, కోనమ్మ, తెదేపా నాయకులు బందలిశివ, మహమ్మద్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములకు రక్షణ కల్పించాలి

ములకలచెరువు, న్యూస్‌టుడే: దళితుల భూములకు రక్షణ కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణప్ప కోరారు. ఈ మేరకు బుధవారం తంబళ్లపల్లె మండలం దిగువపాళ్యం పంచాయతీలో ఆక్రమణకు యత్నించిన భూమిని వ్యవసాయ సంఘం, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో దళితులు తిరిగి సాగు చేసుకోవడానికి చదును చేశారు. దళితులు, వ్యవసాయ కూలీల భూముల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు వెంటనే సాగులో ఉన్న దళితులకు చెందిన భూములకు ఆన్‌లైన్ పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండు చేశారు. నాయకులు నరసింహులు, అంజనప్ప, చంద్రశేఖర్, రమణ, ఉత్తన్న, వెంకటస్వామి, గంగులమ్మ, నాగమ్మ, వెంకటమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

కలకడ : గర్భిణులు పోషకాహారం తీసుకొంటే సుఖప్రసవాలు జరుగుతాయని డాక్టర్ జవహర్‌బాబు సూచించారు. మండలంలోని ఎర్రకోటపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ప్రతి రోజు పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా విరివిగా రుణాలు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని సహకార సంఘాల ద్వారా రైతులకు విరివిగా రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని విజయవాడ నాబార్డు డీజీఎం ఎంఎస్‌ఆర్‌మూర్తి పేర్కొన్నారు. బుధవారం నిమ్మనపల్లె సహకార సంఘంలోని సభ్యుల వివరాలు, ఆర్థికలావాదేవిల కంప్యూటరీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సహకార సంఘాల్లో స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సహకార సంఘాల్లో బంగారుపై రుణాలు, రైతులకు అవసరమైన నానో ఎరువులు ఇస్తున్నట్లు చెప్పారు. వెంగంవారిపల్లె సమీపంలో రూ.40లక్షల నాబార్డు నిధులలో నిర్మించిన బహుళసౌకర్యాల గోదామును పరిశీలించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం విజయవిహారి, సింగిల్‌విండో ఛైర్‌పర్సన్ రఘునాధరెడ్డి, సీఈవో హరినాధరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన


చింతపర్తిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పాల్గొన్న తెదేపా నాయకులు

కలికిరి, (చింతపర్తి) వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వాల్మీకిపురం మండలం చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. చింతపర్తి సర్పంచి మహితాశేషాద్రిరెడ్డి తల్లి అవ్వగారి కృష్ణమ్మ వర్ధంతి సందర్భంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణశాఖ సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో 150 మందికి కంటి వైద్య పరీక్షలు జరిపి వారిలో 56 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు నిర్వాహక ఆసుపత్రి వైద్యులు తెలిపారు. తెదేపా నాయకులు శేషాద్రిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, జమీరుద్దీన్, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, శ్రీనివాసులు, హరినాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కేవీరెడ్డిలు వైద్య శిబిరానికి సహకరించారు.

బహుజనుల ఆశాజ్యోతి కాన్షీరాం


పీలేరులో కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాస్ నాయకులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : కాన్షీరాం బహుజనులకు రాజ్యాధికారం కోసం పాటు పడిన మహనీయుడని బాస్ జిల్లా కోకన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు అన్నారు. బుధవారం పీలేరులో కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మల్లికార్జున, హరినాథ, గురవయ్య, నాగేశ్వరరావు, సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

మదనపల్లె పట్టణం: దేశంలోని బహుజనులకు రాజ్యాధికారం అందించడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప నాయకుడిగా కాన్షీరామ్ చరిత్రలో నిలిచిపోయారని బహుజనయువసేన అధ్యక్షుడు పునీత్ కొనియాడారు. కాన్షీరామ్ వర్ధంతి కార్యక్రమాన్ని అంబేడ్కర్ కూడలిలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పునీత్ మాట్లాడుతూ కాన్షీరామ్ మార్గం అనుసరణీయమని, యువత ఆయన గురించి తెలుసుకుని బహుజనులకు రాజ్యాధికారం సాధించుకోవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. బహుజన యువసేన నాయకులు శశికుమార్, వేణుగోపాల్, ఆది, బాలకృష్ణ, జగదీష్, సాదిక్, నందీప్, బాబ, విగ్నేష్, వినయ్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల పనులకు నిధులు మంజూరు

పీలేరు: పీలేరు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో 121 సిమెంట్ రోడ్ల పనులకు రూ.6.20 కోట్లు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ డీఈ మదుసూధన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురంలో 20 పనులకు రూ.135 లక్షలు, కలికిరిలో 21 పనులకు రూ.105 లక్షలు, కలకడలో 19కి 85 లక్షలు, గుర్రంకొండలో 23కు రూ.85 లక్షలు, కంభంవారిపల్లెలో 13కు రూ.85 లక్షలు, పీలేరులో 25 పనులకు రూ.125 లక్షలు మంజూరయ్యాయని డీఈ వివరించారు. ఈ పనులు ఈ నెల 14వ తేది నుంచి 20వ తేది వరకు జరిగే పల్లెపండుగ కార్యక్రమాల్లో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పంచాయతీ వారోత్సవాల్లో శంకుస్థాపనలు, పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

మహిళా దర్బార్‌లో సమస్యల పరిష్కారం

సిద్దవటం, న్యూస్‌టుడే : బెటాలియన్‌లో మహిళల సమస్యల పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామని బాధ్య కమాండెంటు నాగేశ్వరప్ప తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేట శివారులో ఉన్న ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో బుధవారం మహిళా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల కుటుంబాలకు చెందిన పలువురు మహిళలు తమ సమస్యలను బాధ్య కమాండెంటు దృష్టికి తీసుకొచ్చారు. సహాయ కమాండెంట్లు విల్సన్, ఎస్‌డీ ప్రసాద్, యూనిట్ వైద్యాధికారిణి దివ్వ రాణి, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాధ్య కమాండెంటు నాగేశ్వరప్ప

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతాం

రైల్వేకోడూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా మైసూరివారిపల్లి పంచాయతీని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. గ్రామంలో గ్రామీణ వైద్యశాల నిర్మాణానికి బుధవారం స్థల దాత కారుమంచి నారాయణతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, సర్పంచి కారుమంచి సంయుక్త పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, దాత కారుమంచి నారాయణ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 7981695235

?: పట్టణంలోని కె.రామాపురం లాయర్ నాగిరెడ్డి వీధిలోని ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. వారాల తరబడి సిబ్బంది చెత్తను తొలగించడం లేదు. - రాజు, స్థానికుడు

✔: సమస్య మా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని పంపి చెత్తను తొలగింపజేస్తాం. స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
- వాసుబాబు, కమిషనర్, రాయచోటి - న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

రహదారి ఇలా.. రాకపోకలెలా



పుల్లంపేట మండల పరిధిలోని తిప్పాయపల్లె నుంచి రాజంపేటకు వెళ్లే తారు రోడ్డు మట్టి రోడ్డును తలపిస్తోంది. దేవసముద్రం చెరువు నుంచి రాజంపేట మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డంతా అధ్వానంగా తయారైంది. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో వాననీరంతా గుంతల్లో నిల్వ ఉండటంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని ద్విచక్ర వాహన చోదకులు వాపోతున్నారు. దాదాపు మూడు కిలోమీటర్లు అధ్వానంగా తయారైందని.. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పుల్లంపేట,

అన్నదాతల ఆశలు ఆవరి

రైతులను నిండా ముంచిన అకాల వర్షం

- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ, పెనగలూరు

పెనగలూరు మండలం నారాయణ నెల్లూరులో వరి రైతులు వరి పంట సాగు చేశారు. కేవలం రెండు మూడు రోజుల్లో పంట చేతికి వస్తుందనుకునే లోపు భారీ వర్షం కురవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట నీటిపాలైంది. తడిచిన పంట చేలను చూసిన అన్నదాతలు కన్నీరు మున్నీరయ్యారు. అప్పు తెచ్చి పంటకు పెట్టుబడులు పెట్టినా వర్షార్పణమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లో పైర్లు నీళ్లలోనే నానుతున్నాయని.. ప్రభుత్వం ఆదుకోవాలని వారంతా వేడుకుంటున్నారు. గ్రామానికి చెందిన రైతులు సురేష్‌బాబు, వెంకటేష్, చిన్నయ్య, రుద్రకుమార్, చెంగల్‌రాయుడు, మురళి, ధర్మయ్య, కృష్ణయ్య, కౌలు రైతు సూర్యనారాయణతో పాటు పలువురు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ అధికారులు తమ పంటలను పరిశీలించి నష్టపరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నారు.


నారాయణ నెల్లూరులో వర్షం కారణంగా తడిచిన ధాన్యం


పొలంలో వాన నీరు నిలవడంతో మునిగిన వరిగడ్డి

తీవ్ర నష్టం వాటిల్లింది



ఆరు ఎకరాల్లో వరి సాగు చేశా. ఈ రోజు ఉదయాన్నే రెండు వరికోత మిషన్లతో పంట మొత్తాన్ని నూర్పిడి చేశాం. సాయంత్రం ఇంటికి వచ్చాము. అకస్మాత్తుగా భారీ ఎత్తున ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. రూ.రెండు లక్షల మేర నష్టం వాటిల్లింది. - వెంకటసుబ్బయ్య, రైతు, నారాయణనెల్లూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. కోతకు సిద్ధమవుతుండగా అకస్మాత్తుగా వర్షం కురవడంతో పంటంతా నానిపోయింది. మంచి దిగుబడులు వస్తాయని ఆశించేలోపు ఇలా జరిగింది. ధాన్యానికి మోసులొస్తే నూర్పిడి చేసినా ప్రయోజనం లేదు. వ్యాపారులు కొనడానికి ఆసక్తి చూపరు. దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లింది. - వై.సురేష్‌బాబు, రైతు

మోపురంపల్లిలో తీరిన తాగునీటి సమస్య

సంబేపల్లె(రాయచోటి), న్యూస్‌టుడే: దుద్యాల గ్రామం మోపురంపల్లిలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని తెదేపా నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలోని కొత్తపురమ్మ ఆలయం వద్ద ఇటీవల వేసిన తాగునీటి బోరును బుధవారం ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో ఇప్పటికే 60 తాగునీటి బోర్లను తవ్వించి శాశ్వత పరిష్కారం చూపామన్నారు.

ఉద్యోగులు సమయ పాలన పాటించాలి

గాలివీడు, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో జవహర్‌బాబు పేర్కొన్నారు. ఒకటో గాలివీడు సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు. విధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది సత్వరమే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంఘం కమిటీ ఎన్నిక

సుండుపల్లి, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల కమిటీ బుధవారం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా డి.వెంకటేశు, ఉపాధ్యక్షుడిగా కె.రవీంద్ర, కార్యదర్శులుగా మహేంద్ర, శ్రీను, అర్గనైజింగ్ కార్యదర్శిగా మల్లికార్జున్, గౌరవాధ్యక్షులుగా పరమేష్‌లు ఎంపిక య్యారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంఘం కట్టుబడి పనిచేస్తుందని కార్మికులు ఐక్యతగా ఉండి పనులు చేసుకోవాలని నాయకులు సూచించారు.

ఎంపీడీవోగా నూర్జహాన్

వీరబల్లి, న్యూస్‌టుడే: మండల ఎంపీడీవోగా బుధవారం నూర్జహాన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. అనంతరం ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.


రైల్వేకోడూరులో చదువుల తల్లిగా దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి


అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


సరస్వతీదేవి అలంకారంలో సాధుకామాక్షమ్మ

సరస్వతీ నమస్తుభ్యం

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో దసరా శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు చదువుల తల్లి సరస్వతిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆర్యవైశ్య యువకులు పలు ప్రాంతాల్లో బిందె సేవ నిర్వహించారు. మహిళలు అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం


చిన్నమండెం అమ్మవారిశాలలో సరస్వతిదేవిగా దర్శనమిచ్చిన కన్యకాపరమేశ్వరీదేవి


సరస్వతిదేవి అలంకరణలో కాళికాంబ అమ్మవారు


వీరబల్లి : సరస్వతీదేవీ అలంకారంలో కన్యకా పరమేశ్వరి

డిసెంబరు నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండలంలోని గృహ నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఎంపీడీవో జయశ్రీ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఉపాధి, సచివాలయం సిబ్బందితో బుధవారం ఆమె సమావేశమయ్యారు. కార్యక్రమంలో లబ్ధిదారులను చైతన్యపరచి వారి గృహాలను సకాలంలో పూర్తి చేసుకునేలా ఉత్తేజపరచాలన్నారు. ఏపీఎం సుబ్బలక్షుమ్మ, ఈవోపీఆర్డీ పెంచలయ్య పాల్గొన్నారు.

పెనగలూరు: ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని డీఈ మురళి ఆదేశించారు. ఎంపీడీవో విజయారావు అధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఏఈ హరి, సిబ్బంది పాల్గొన్నారు.


పెనగలూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ మురళి

రాయచోటిని వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతాం


సీఎన్‌జీ ద్విచక్ర వాహనాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి, నాయకులు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిని వ్యాపార కేంద్రంగా తీర్చిద్దుతామని తెదేపా నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని చిత్తూరు రోడ్డులో ఉన్న బజాజ్ షోరూంలో నూతనంగా మార్కెట్‌లోకి వచ్చిన బజాజ్ ఫ్రీడం సీఎన్‌జీ ద్విచక్ర వాహనాన్ని ఆయన ప్రారంభించారు. చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. తెదేపా నాయకులు ఎం.నరసారెడ్డి, ఖాదర్‌వలీ, రంగారెడ్డి, షోరూం యజమాని అబ్దుల్‌కలాం, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం అందజేత

నందలూరు, న్యూస్‌టుడే : స్థానిక మండల ఆరోగ్య కేంద్రంలో బుధవారం రాయల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు సంస్థ అధ్యక్షుడు గంగనపల్లి శ్రీనివాసులు బుధవారం పౌష్టికాహారం అందజేశారు. ప్రసవ సమయంలో రక్తహీనతతో చాలా మంది గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మండల వైద్యాధాకారులు శరత్‌కమల్, కార్తీక్ విశ్వనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పౌష్టికాహారం అందిస్తున్న రాయల్ సేవా సమితి సభ్యులు

అర్హులకు ఇంటి పట్టాలివ్వాలని నిరసన

రామాపురం, న్యూస్‌టుడే: అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేసి. . పక్కా గృహాలను నిర్మించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయం ఎదురుగా బుధవారం సీపీఐ నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వంలో అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో చాలా మంది అర్హులు ఇంటి స్థలాలు మంజూరు చేయించుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి న్యాయం చేయాలన్నారు. సీపీఐ మండల నాయకులు సురేంద్ర, సుబ్బమ్మ పాల్గొన్నారు.


సీపీఐ నాయకులతో కలిసి ధర్నా చేస్తున్న శ్రీనివాసులు

గంజాయి విక్రేతల అరెస్టు

పుల్లంపేట, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ బీవీ రమణ, ఎస్సై మోహన్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం వారు మాట్లాడుతూ పుల్లంపేట మండలం అప్పయ్యరాజుపేట పెట్రోలు బంకు సమీపంలో సోదాలు చేయగా గంజాయి విక్రయిస్తూ పూల లక్ష్మీదేవి, షేక్ అఫ్రిదిలు పట్టబడ్డారన్నారు. వారి నుంచి కేజీ గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీవీ రమణ

వినియోగంలోకి శ్రీరామ ఎత్తిపోతల పథకం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని నీటిపారుదల శాఖ సాంకేతిక నిపుణులు బుధవారం వినియోగంలోకి తీసుకొచ్చారు. గత నెల 27న కోటపాడు సమీపంలో పైపులైను దెబ్బతింది. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో మోటార్లు ఆగిపోయాయి. ఇంజినీరింగ్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి కోటపాడు వద్ద పంపుహౌస్‌లో మోటారు వేసి సోమశిల వెనుక జలాలను విడుదల చేశారు. త్వరలో రెండు మోటార్ల ద్వారా సోమశిల వెనుక జలాలను ఏకశిలానగరి తటాకంలోకి తరలిస్తామని నీటిపారుదల శాఖ కడప డివిజన్ ఈఈ డి.వెంకట్రామయ్య తెలిపారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై డీఎల్‌డీవో విచారణ

క్షేత్రస్థాయిలో పరిశీలనకు తెదేపా నేతల వినతి

వీరబల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంతో పాటు పలు పంచాయతీలకు ఇటీవల వచ్చిన నిధులు దుర్వినియోగం చేశారని..గత నెలలో కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే విచారించి నివేదిక సమర్పించాలని రాజంపేట డీఎల్‌డీవో నరసింహమూర్తిను కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆయన బుధవారం విచారణ నిమిత్తం వీరబల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారు మాత్రమే తమ వద్ద ఉండాలంటూ ఆదేశించడంతో అన్ని పంచాయతీల నుంచి ప్రజలు వచ్చారని అందరి సమక్షంలో విచారణ చేపట్టాలని తెదేపా మండల అధ్యక్షులు భానుగోపాల్ రాజు, నాయకులు అమరేశ్వర్‌రాజు, సురేంద్రారెడ్డి, ఆంజనేయులు రెడ్డి, తెదేపా నాయకులు పట్టుబట్టారు. గ్రామాల్లో పనులే చేయకుండా బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. ఆయా గ్రామ పంచాయతీలల్లో వైకాపాకు చెందిన పాలకులు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు పనులు చేయకుండానే చేసినట్లు చూపి నిధులు స్వాహా చేశారని.. ఓ ప్రైవేటు వ్యక్తిపై అన్ని గ్రామాల్లో అతని పేరిట రూ.40 లక్షలు వరకు డ్రా చేశారని.. వాస్తవాలను వెలికి తీసేలా చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని తెదేపా నాయకులు హెచ్చరించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తానని చెప్పి డీఎల్‌డీవో అక్కడిని నుంచి వెళ్లిపోయారు.


పంచాయతీ నిధుల దుర్వినియోగంపై డీఎల్‌డీవో నరసింహమూర్తిని ప్రశ్నిస్తున్న తెదేపా నేతలు